7

# సజీవ నాదం

అది పుష్యమాసం. నిద్రపట్టకపోతే, గదిలోంచి బయటికొచ్చి, బాల్కనీ పిట్టగోడని ఆనుకుని చూస్తున్నాను.

చలిగాలి, జివ్వున ఒక్కసారిగా నా ఒంటిని తాకింది. ఆ చలికి రెండు చేతులు ముడుచుకుని గుండెలకి దగ్గరగా లాక్కున్నాను.

పుష్యమాసంలో పూచే పూసంత పూతతో ఉన్న బంగారు గుత్తులతో ఠీవిగా, హుందాగా నుంచుంది, పక్కవాళ్ళ మామిడి చెట్టు.

వీధి దీపం కింద, పొగమంచు, దట్టంగా చిక్కుకుపోయి, బయటికి రాలేక అలాగే గాల్లో వేళ్ళాడుతోంది.

వాలిపోతున్న నక్షత్రాల వెలుగులో, ఆ చీకట్లో దిగంతాల అవతలకి తొంగి చూడ్డానికి ప్రయత్నిస్తున్నాను.

ఆశ!... ఏదో ఆశ!

ఆ వెనకాల నుంచి ఏదైనా అవకాశం రాదా! నన్ను నేను నిరూపించుకోడానికి ఓ చక్కటి అవకాశం.

అలాంటి అవకాశం మిణుకు మిణుకు మంటూ ఓ చిన్న దీపం వెలుగులా కనిపిస్తుందేమోనని చూస్తున్నాను.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో, ఇంటి వాళ్ళు తలుపు గడియ లాగి తీసిన శబ్దం, వెంటనే చిన్న శబ్దంతో తలుపు తెరుచుకున్న శబ్దం. అటువైపు చూశాను.

ఇంటావిడ, సీతమ్మగారు గుమ్మం దగ్గర నుంచున్నారు. చలికి, కొంగుని బాగా దగ్గరగా లాక్కుంటూ నావైపుగా వచ్చారు.

"నేను నీ కోసమే బయల్దేరాను... ఇక్కడే, బయట నువ్వే కనిపించావు..." గొంతులో కంగారు.

ఆవిడ మాటలకి ఆశ్చర్యపోయాను.

ఆవిడకున్న మూడు గదుల ఫ్లాటులో ఓ గది, బాత్రూం, ఓ కామన్ బాల్కనీ అద్దెకిచ్చారు.

ఇది ఇవాళా, నిన్న కాదు. రెండేళ్ళ క్రితం జరిగింది.

అప్పటినుంచి, ఈ రోజు వరకు ఆవిడ నాతో ఎప్పుడూ మాట్లాడలేదు.

అద్దెని, గదిలో నాతో ఉండే విక్రం సీతమ్మగారి భర్త రాఘవరావుగారికి ఇస్తూండే వాడు. అందువల్ల, ఆవిధంగా కూడా వాళ్ళతో మాట్లాడే అవకాశం రాలేదు.

వాళ్ళతో మాట్లాడకపోయినా, అటూ ఇటూ బయటికి వెళ్తూన్నప్పుడు, పొద్దున్న రాఘవరావుగారు వాకింగ్ వెళ్తూన్నప్పుడు చూసేవాడిని. కానీ, వాళ్ళకెప్పుడూ నేను ఎదురుపడలేదు.

ఇంత రాత్రివేళ ఆవిడ ఎదురొచ్చి మాట్లాడుతూంటే ఆశ్చర్యం వేసింది.

"నా కోసమా! ఈ వేళప్పుడా! చలిలో...." అని ఆగి,

"అయినా బయట బాగా చలిగా ఉంది. ముందు మీరు మీ ఇంట్లోకి పదండి. నేను మీ వెనకాలే వస్తాను..." అని ఆవిడ వెనకాలే వాళ్ళ ఇంట్లోకి వెళ్ళాను.

"బాబయ్యగారు గదిలో ఉన్నారు... లోపలికి రా... నాకు కొంచెం కంగారుగా ఉంటే, నిన్ను పిలిచాను..." అంటూ వాళ్ళ గదిలోకి వెళ్ళారు.

అక్కడ మంచం మీద ఉన్న రాఘవరావుగారిని చూసి మాట రాలేదు.

కళ్ళు తేలేస్తున్నారు. బాగా ఆయాసపడిపోతున్నారు.

"ఉండండి.. ఆటో తెస్తాను..." అని గబగబా కింద సెల్లార్‌లో ఉన్న నా సైకిల్‌మీద వెళ్ళి ఓ ఆటోను తీసుకొచ్చాను.

ఆటోలో వెనక సీతమ్మగారు, రాఘవరావుగారు కూచుంటే నేను ముందు డ్రైవర్ పక్కనే కూచున్నాను.

కొంచెం దూరంలో ఇరవయి నాలుగ్గంటలూ పనిచేసే ఆస్పత్రిలో చేర్పించాం.

ఆ రాత్రి మేం అక్కడే ఉన్నాం.

మర్నాడు నా రూంమేటు విక్రంకి ఫోన్ చేసి, ఇంటాయన విషయం అంతా చెప్పాను.

షూటింగ్‌లో ఉండి బిజీగా ఉన్నానని, మరో వారం పది రోజులవరకు రావడానికి కుదరదని, వాళ్ళిద్దర్ని కనిపెట్టుకుని అన్ని విధాలుగా సాయం చేయమన్నాడు.

ఇంచు మించుగా మేం ఇద్దరం ఒకేసారి హైదరాబాద్ సినిమాల్లో వేషాల కోసం వచ్చాం.

అదృష్టం విక్రంవైపు దృష్టి పెట్టింది. వాడికి ఇటు సినిమా వేషాలు, టీవీల్లో వేషాలు వస్తున్నాయి.

నాకు వేషాలు చాలా తక్కువ. వచ్చినవి కూడా ఏవో చిన్నా చితకవే.

ఓ రోజు తినీ, ఓ రోజు తినక రోజుల్ని ఈడుస్తున్నాను. కానీ ఇంటికి ఇంట్లో వాళ్ళకి తెలియనివ్వలేదు. తలదాచుకోడానికి గూడు ఉంది. పర్వాలేదు. విక్రం గదిలో ఉంటున్నాను.

ఆసుపత్రిలో, రాఘవరావుగారు పడుకున్నప్పుడు మేమిద్దరం మాట్లాడు కుంటున్నప్పుడు సీతమ్మగారు గుర్తు తెచ్చుకుంటున్నట్లుగా మొహం పెట్టి అన్నారు.

"మీరిద్దరూ, అద్దెకి గది కావాలని వచ్చిన రోజూ ఇంకా గుర్తుంది. ఆ రోజులు అలా ఉన్నాయి. డబ్బు అవసరం కొద్ది మీకు అద్దెకిచ్చేశాను, ఇంకో ఆలోచనలేదు.

కానీ, ఎప్పుడైతే, మీరు సినిమాల్లో వేషాలు వేసే వాళ్ళని తెలిసిందో, ఆ వెంటనే మిమ్మల్ని పొమ్మందామనుకున్నాను.

కానీ, మీరిచ్చిన మూడు నెలల అడ్వాన్సు అప్పటికే వాడేయడంతో, ఏమీ అనలేకపోయాను. ఆ తర్వాత నెల అద్దె తీసుకోకూడదనుకున్నాను. తీసుకున్నాను. మిమ్మల్ని పొమ్మందాం అనుకున్నాను. కానీ, అనలేదు. డబ్బు అవసరం అలాంటిది. అలాగే ఈ రెండేళ్ళూ గడిచిపోయాయి.

ఈ రెండేళ్ళల్లో, మిమ్మల్ని దగ్గరగా ఎప్పుడూ చూడలేదు. అవకాశం రాలేదనుకో... కానీ, ఇప్పుడు ఈ అవకాశం వచ్చాక, ఇన్ని రోజులు, ఇన్ని గంటలు చూశాక తెలుస్తోంది...

అర్ధరాత్రి, అపరాత్రి అని అనుకోకుండా సాయం చేస్తున్నావు. నువ్వింత సాయపడే గుణం ఉన్న వాడివని, నీలో ఇంత మంచితనం ఉందని అనుకోలేదు.

నీ వినయం, నీ సేవాతత్పరత చూస్తుంటే, నాకు చాలా ఆనందంగా ఉంది. నువ్వు ఈ కాలం కుర్రాడిలా లేవు..."

మళ్ళా ఉలిక్కి పడ్డాను.

"మీరు అనుకున్నట్లుగా నాలో మంచితనం లేదు. నేను మంచివాడిని కాను. నేను నూటికి నూరుపాళ్ళు ఈ కాలం పిల్లవాడిని.

మీకు తెలీదు, కానీ నాకు రెండు మొహాలు. ఒకటి మీరు చూస్తున్నది. నా రెండో మొహం నావాళ్ళకి తెలిసినది.

ఈ రెండు మొహాలకి సహస్రం... తేడా ఉంది." అని, ఆవిడకి నిజం చెప్పేయాలనుకున్నాను.

కానీ, ధైర్యం చాల్లేదు.

ఆవిడ అంత మంచి మాటలు మాట్లాడాక, నా గురించి నేను నిజం చెప్పడం, నన్ను నేను కించపరచుకోడం అవుతుంది అని అనుకుని ఊరుకున్నాను.

ఆ తర్వాత కూడా, వీలున్నప్పుడల్లా ఆవిడ అనేవారు ఆవిడ అలా అంటున్నప్పుడల్లా, ఎవరో ఓ కొరడా తీసుకుని చెళ్ళు, చెళ్ళు మని కొడుతున్నట్లుగా అనిపించేది.

నా విషయాలు ఎక్కడ అడుగుతారోనని, ఆవిడ విషయాలు నేనెప్పుడూ అడగలేదు.

వీలయినంత తక్కువగా మాట్లాడి, ఓ విధంగా సంభాషణని పెంచకుండా, నా విషయాలు రాకుండా జాగ్రత్త పడేవాడిని.

వాళ్ళని చూస్తుంటే అమ్మానాన్నలు గుర్తొస్తున్నారు. వాళ్ళది ఇదే వయసు. అక్క పెళ్ళి, చెల్లి పెళ్ళి చేసేశారు. కాబట్టి వాళ్ళూ ఇలాగే, ఇంట్లో ఇద్దరే ఉండాలి. రాఘవరావుగారిలా నాన్నగారు మంచం పడితే అమ్మకి ఎవరు సాయం చేస్తారు?

కూరలూ, సరుకులు రోజూ ఎవరు తెస్తున్నారు! బిల్లులు ఏవేవో ఉంటాయి. అవి ఎవరు కడుతున్నారు?

తప్పు చేశాను ఇల్లు వదిలి.

ఘర్షణ. ఎందుకు ఇల్లు వదిలాను! సందిగ్ధావస్థ. నేను ఇల్లు వదిలిన కారణాలు చెప్తే, సీతమ్మగారు తేలిగ్గా తీసుకోవచ్చు. లేదా అర్థరహితంగా అనిపించవచ్చు.

రాన్రాను, తప్పు చేశానా అన్న భావం నుంచి, నిజమే తప్పు చేశాను అన్న స్థితికి వచ్చేశాను.

ఈ రెండేళ్ళల్లో, నాలో గడ్డకట్టుకున్న వ్యతిరేక భావాలు రోజు రోజుకి, కరిగి పోవడం మొదలైంది.

అనూహ్యమైన రీతిలో గుండె మూల మూలాల్లో చెమ్మ, చెలమ ఊరిపోవడం మొదలైంది.

ఆ రోజున రాఘవరావుకి కాస్త బాగానే ఉంది. నేను సీతమ్మగారు, కారీరు తీసుకుని ఆస్పత్రికెళ్ళాం.

సీతమ్మగారు మాటల సందర్భంలో రాఘవరావుగారి గురించి చెప్తున్నారు.

"మీ బాబయ్యగారి చేతికి ఎముక లేదు. ఓ చేత్తో ఇచ్చినది, మరో చేతికి తెలీకుండా ఉండేవి ఆయన దానధర్మాలు, చందాలు.

పెళ్ళిళ్ళని, పేరంటాలని, చదువుకోడానికి, ఆపరేషన్ల కోసం, ఏదో ఒకటి, ఎంతో కొంత ఇచ్చేసేవారు.

ఆయన ఆత్మ వైశాల్యం రోజు రోజుకి పెరుగుతూ వచ్చింది. కానీ, ఏనాడూ కుంచించుకు పోలేదు.

ఏదో ఈ ఫ్లాటూ, పెన్షను మిగిలింది..." అని అన్నారు.

"మనకున్నదాన్లో కొంచెం ఇవ్వడంలో తప్పేం లేదు. అన్నీ మనం మనతో ఆ పైకి తీసుకెళ్ళం కదా... ఏమంటావ్!" అంటూ నా వైపు చూశారు రాఘవరావుగారు.

"ఆ పిల్లాడేం చెప్తాడు! నేను చెప్తాను వినండి. గొప్ప శిఖరాలున్న మనిషిలో, గొప్ప వెలితితో కూడిన లోయలు కూడా ఉంటాయి.

కొందరు శిఖరాగ్రాల్ని చూస్తారు. కొందరు లోయల్ని చూస్తారు. అది వారి వారి స్వభావాల్ని బట్టి ఉంటుంది..." అని అంటున్న సీతమ్మగారి మొహంలో అమ్మ కనిపించింది.

"ఎవర్నీ ఏమీ అనకు. మనకి పిల్లల పరిస్థితులు ఏమిటో తెలీదు! ఎలా అయినా పిల్లలు పిల్లలే..." అని రాఘవరావుగారు అంటూంటే నాన్నగారిలా అనిపించారు.

నాకింకా ఏం వినపళ్ళేదు.

నాన్నగారు కూడా అంతే. తెలిసిన వాళ్ళందరికి ఆయన ఓ గొప్ప మనిషి. నాకు మాత్రం ఛండశాసనుడు. హిట్లరు.

నేను ఆయనలోని ఓ కోణం చూశాను. అందులో అన్నీ లోపాలే.

ఓ మనిషి గొప్పతనం చూడాలంటే గొప్ప మనుసుండాలి.

కానీ, నాకది లేదు. నా ఇష్టాల్ని చూడకుండా తన ఇష్టాల్ని నా మీదకి రుద్దేవారని అనుకున్నాను.

ఉడుకురక్తం తెచ్చిన ఆవేశం తప్ప ఆలోచనే లేదు. నాన్నగారు నా మంచికే చెప్తున్నారని అనుకునే వాడిని కాదు.

నాన్నగారి స్వభావం ప్రకారంగా ఆయన, నా స్వభావం ప్రకారంగా నేను చేస్తూంటే ఒకరిపైన ఒకరు కోపం తెచ్చుకోవడంలో అర్థం లేదు.

సీతమ్మగారిని ఇంటి దగ్గర దిగబెట్టి, నేను మళ్ళీ ఆసుపత్రి కొచ్చాను.

రాఘవరావుగారు నిద్రపోతున్నారు.

అక్కడే ఉన్న పొడుగు సోఫామీద వాలి, కళ్ళు మూసుకున్నాను. ఆస్పత్రి అంతా నిశ్శబ్దంగా ఉంది.

కళ్ళు మూసుకున్న నేను, ఆ నిశ్శబ్దంలో నన్ను నేను విమర్శించుకుంటున్నాను. నన్ను నేను డిఫైన్ చేసుకుంటున్నాను.

నా అంతరాత్మని నొక్కేశాను అని అనిపించింది. అందుకే అది మంచి, చెడు ఏది నిజం, ఏది సత్యం, అన్నీ చెప్పే ఉండచ్చు. కానీ, నొక్కుకుపోతే స్పష్టత లేక నాకు వినపడలేదు కాబోలు.

మనిషి స్వభావంలో ఉత్తమమైనది అంతరాత్మ. దాన్ని కూడా వంచించి పతితుడనయ్యాను.

ఇన్ని రోజులు నేను ఓ మురికి గాజు తలుపుకి ఇవతల కూచున్నాను. మసక మసకగా కనిపిస్తున్న అవతల వాళ్ళని చూశాను.

ఇప్పుడు ఆ మురికి గాజు తలుపు భడాలున బద్దలయ్యింది. అవతల ఉన్న వాళ్ళు స్పష్టంగా కనిపిస్తున్నారు.

స్వచ్ఛంగా, ఏ మాలిన్యమూ అంటని దేవతా విగ్రహాల్లా ఉన్నారు. వాళ్ళు అమ్మా, నాన్నగారు, అక్క, చెల్లి... ఇన్నాళ్ళు చూడని, ఆప్యాయత, ప్రేమ, అనురాగం వాళ్ళల్లో నిలువెల్లా ప్రతిబింబిస్తోంది. సరిగ్గా చిన్నప్పుడు వాళ్ళని ఇలాగే చూశాను. ఈ మాయపొరలు వీడాక మళ్ళీ అలాగే కనిపిస్తున్నారు.

నాన్నగారిలో అదే హుందాతనం, పెద్దరికం.

నాదీ, వాళ్ళదీ ఒకటే రక్తం. జీవశాస్త్రం ప్రకారంగా మేమంతా ఒకే రక్తంతో అల్లుకోబడ్డ వాళ్ళం. ఒకే ఇంటి పేరుతో ఒకే కుటుంబంలోని వాళ్ళం.

ఏదో వేషాల కోసం తాపత్రయపడ్డాను. నన్ను నేను నిరూపించుకునే వేషం కోసం ఎదురు చూశాను.

ఓ కొడుకుగా నన్ను నేను నిరూపించుకునే సమయం వచ్చింది. ఇన్ని రోజులూ నాన్నగారి లోపాల్ని చూశాను. పిల్లల దృష్టిలో ఏ తండ్రీ కూడా సంపూర్ణుడు కాడు. ఏదో ఓ లోపం కనిపిస్తునే ఉంటుంది.

ఆ తర్వాత రాఘవరావుగారిని ఇంటికి పంపించారు. సీతమ్మగారితో ఎక్కువ మాట్లాడే అవకాశం రాలేదు. ఆ తర్వాత నాకు చిన్న చిన్న వేషాలు ఒక్కసారిగా వచ్చాయి.

మొదటిసారి, ఇంట్లోంచి వచ్చిన ఇన్ని రోజులకి ఉత్తరం రాశాను. షూటింగులయిపోయాక ఇంటికి ప్రయాణం పెట్టుకున్నాను.

బయటికొచ్చి, ఒక్కసారి ఆ ఇంటివైపు చూశాను. నాలుగో అంతస్థులోని చివరి ఫ్లాటు కేసి చూశాను. మొదట్లో ఆశ్రయం. తర్వాత వాళ్ళ హృదయాల్లో పీఠం. ఆ తర్వాత నాలో, లోపల్నించి వచ్చిన మార్పు... అది విలువైన మార్పు. అంతా మంచి చేసిన మార్పు. అన్నీ అక్కడే.

బస్సు ఎక్కాను.

బస్సు పరిగెడ్తున్న ఈ దారికి ఆవలి వైపున మావాళ్ళు నా కోసం ఎదురు చూస్తుంటారు అని తెలుసు.

ఇన్నాళ్ళూ ఈ జీవితంలో ఓ యంత్రంగా పని చేశాను. అందుకే జీవకళ తప్పింది.

ఇప్పుడు జీవితపు నాణ్యతను పెంచుకునే అవకాశం వచ్చింది. అందులో యంత్రానికుండే స్పందన ఉండదు.

సజీవ స్పందన. అందులోంచి సజీవనాదం ఇంక ఇందులో అపశ్రుతి రానీయను.

*ఆకాశవాణిలో ప్రసారం, 11 జనవరి 2010*